
# సోమా

చంద్రమౌళి




లేడి గెంతినట్లు గెంతుతూ కాబిన్ బాగేజ్ కుడి భుజానికి తగిలించుకుని మెట్లెక్కింది సోమా. ఓ క్షణం రొప్పు నణుచుకుంటూ, హాటు సరిచేసుకుని, నిలబడి వెనక్కి తిరిగి చూసింది. 'టార్మక్ మీద నిల్చున్న పాపా, మమా మసమసకగా కనిపిస్తున్నారు. స్టాక్‌హోం ఎర్‌పోర్ట్ వెలిగిపోతున్నది దివ్యంగా.

బాగేజ్ కుడి భుజం నుంచి ఎడమ భుజం మీదికి మార్చి కుడి చెయ్యి ఎత్తి గాలిలో సిగ్నల్‌లాగా ఊపింది సోమా. అల్లంత దూరాన మమా, పాపా చేయెత్తి తన గ్రీటింగ్స్‌కు ప్రతిగా గాలిలో, 'హాంకీలు' గాలిపటాల్లాగా ఎగరవేయటం కనుపించింది. తృప్తిగా గాలి పీల్చుకున్నది సోమా. చల్లటిగాలి శ్వాసనాళాల్లోంచి ప్రవహించి నరనరాలనూ కంపింపజేసింది. శరీరం స్పందన కోల్పోయింది. వెన్నెముకలో ఏదో పెళుక్కు మన్నట్లనిపించింది. గుండెల్లో ఎవరో చక్కిలిగిలి పెట్టినట్లనిపించింది. ఆమె చూపులు మెల్లిగా చేతుల మీదకు పాకినాయ్. గాలివాటుకు కదులుతున్న చెట్ల ఆకుల్లా వణికిపోతున్నాయ్ చేతులు, గ్లవ్స్‌లో ఉండి కూడా. సోమా ఒక్క క్షణం తడబడింది.

మెల్లిగా తనని తాను కూడదీసుకుని మళ్ళీ చేయెత్తి మమా, పాపాలకు వీడ్కోలు పలికింది. అడుగులో అడుగు వేసుకుంటూ ప్లేన్‌లోకి వచ్చింది సోమా. బోర్డింగ్ కార్డ్ చూసి హోస్టెస్ ఆమెకు తన సీటు చూపింది. బాగేజ్ పెట్టేసి సీటుమీద కుప్పలా కూలిపోయింది సోమా. ఆమె చూపులు వర్తులాకారంగా తిరిగి కప్పుమీద ఆగినయ్. అలసటగా కాళ్ళు పారజాచి కళ్ళు మూసుకుంది.

రెండు రోజులు ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ప్రాబ్లెమ్స్ ఆఫ్ అండర్ ప్రివిలేజెడ్'లో పాల్గొనటానికి, తరువాత మూడు రోజులు ఇండియాలో ముఖ్య ప్రాంతాల్లో పర్యటించటం కార్యక్రమంగా ఇండియా వెళుతున్నది తను. ఈ ప్రయాణానికి ఇప్పటికి నెల రోజులుగా యత్నాలు సాగిస్తూనే ఉంది. మొదట మమా, పాపా ఒప్పుకోలేదు తనని ఒంటరిగా ఇండియా పంపించటానికి. అక్కడ టెర్రరిజం, అస్తవ్యస్తంగా ఉన్న లా అండ్ ఆర్డర్ సిచ్యుయేషన్ వంకగా సోమాను నిరుత్సాహ పరచటానికి ప్రయత్నించారు. అయితే చిన్నప్పటి నుంచీ సోమా పెంకిఘటం. తను చేయదలుచుకున్నది చేసి తీరాల్సిందే, ఏమైనా సరే విధిలేక మమా, పాపా ఒప్పుకోకతప్పలేదు.

నిర్ణయం తీసుకున్నప్పటినుంచీ మమా, పాపాలలో ఏదో వింత మార్పు రావటం సోమా గుర్తించకపోలేదు. ఎప్పుడూ ఏదో దిగులుగా, పరధ్యానంగా ఉండసాగారు. తన ఎరుకలో మమా, పాపాలు అలా ఉండలేదు. ఇంచుమించుగా అన్ని దేశాల్లోనూ టెర్రరిజం, లా అండ్ ఆర్డర్ ట్రబుల్ ఇలాగే ఉన్నాయని వాళ్ళని కన్విన్స్ చేయటానికి ప్రయత్నించింది సోమా. అయినా ఏ విధమైన మార్పు లేదు. పోనీ వాళ్ళని కూడా తనతో ఇండియా రమ్మని ప్రాధేయపడింది సోమా. ఇద్దరూ పెదాలైనా కదపలేదు. రోజులు గడుస్తున్న కొద్దీ వాళ్ళ ముఖాల్లో విషాదం, వార్ధక్యం కొట్టవచ్చినట్లు కనిపించసాగినాయ్.

ఆలోచించి, ఆలోచించి సోమా దాని కొక కారణం కనుక్కున్నా ననుకున్నది. తనకు బుద్ధి తెలిశాక మమానూ, పాపానూవదిలి తను ఎక్కడికీ వెళ్ళిందిలేదు. ఇరవయ్యేళ్ళ తన జీవితంలో ఒక్కతే తన దేశం వదిలి వెళ్ళింది లేదు. చదువూ, ఉద్యోగమూ, వ్యావృత్తులూ అన్నీ తన స్వదేశం స్వీడన్‌లోనే. స్వీడన్‌ను మించిన అందమైన, ప్రియమైన ఫాదర్ లాండ్ లేదనే ఆమె గాఢవిశ్వాసం. అంతకు మించిన స్వర్గమే లేదు.

అలా అని తను ఏ ఇతర దేశమూ వెళ్ళలేదని కాదు. అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ ఎన్నో దేశాలు వెళ్ళింది. అయితే ఆ యాత్ర లన్నీ మమా, పాపాలతోటే చేసింది. ఒంటరిగా వెళ్ళలేదు. ఎంత సరదాగా ఉండేవి ఆ ప్రయాణాలు. పాపా, మమా తనని తమ సంతానంగా కాక, ఒక మిత్రురాలిగా భావించే వాళ్ళు. వయసులో ఉన్న తేడాను ఎక్కడా కనబడనిచ్చేవాళ్ళు కాదు.

ఇదే మొదటిసారి, వాళ్ళు వెంట రాకుండా తను వెళ్ళటం. కాన్ఫరెన్స్ వాళ్ళు ఎంతో ఇన్ఫర్మేషన్ పంపారు ఇండియాను గురించి, ప్రపంచానికే వజ్రకిరీటం లాటి కాశ్మీర్, అమరప్రేమకు ధవళ కానుక తాజ్‌మహల్, శిల్పుల ఉలులు తాండవమాడిన ఖజురాహో, అధునాతమైన ఢిల్లీ, బొంబాయి పట్నాలు, సఫారీ పార్కులు, బంగారు బీచెస్. వాళ్ళు పంపిన బ్రోషర్స్ చూస్తుంటే భారతదేశం భూతలస్వర్గమేమో అనిపించింది.

ఇవన్నీ చెప్పి పాపా, మమాలను తనతో రమ్మని చెబుతే ఇద్దరూ ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. కత్తివాటుకు నెత్తురుచుక్క లేదు ఇద్దరి ముఖాల్లోనూ. ఒకరి ముఖం ఒకరు వింతగా చూసుకున్నారు. అయినా ఇద్దరూ పెదవి కదపలేదు. తను అన్నదాంట్లో తప్పేమిటో సోమాకు అర్థం కాలేదు ! ఇన్నేళ్ళూ లేనిది ఇప్పుడు హఠాత్తుగా పాపా, మమాలకూ తనకూ మధ్య ఏదో అగాధం ఏర్పడట్టుగా తోచింది ఆమెకు.

విమానం బయలుదేరింది. సోమా ఇంకా కళ్ళు మూసుకునే ఉంది. మూసిన కళ్ళముందు మమా, పాపాల ముఖం మళ్ళీ కనిపించసాగింది. పాపా మమాను ఊరడించటానికి ఎంతని ప్రయత్నించారు. అయినా ఆయన మాటలలోనూ దృఢత్వం లేదు. మాటవరసకు చెప్పిన మాటల్లా ఉన్నాయ్ కాని కన్విన్సింగ్‌గా లేవు.

మమా, పాపాల మధ్య చిక్కటి అనుబంధం గూడుకట్టుకుని ఉంది. వాళిద్దరి మధ్యా పొరపొచ్చాలు రావటం తా నెప్పుడూ చూడలేదు తెలిసిన ఎందరు దంపతులు విడాకులు తీసుకుని విడివడలేదు? ఎందరు పునర్వివాహాలు చేసుకోలేదు? అయినా మమా, పాపాల వివాహం ఏవిధమైన ఒడుదుడుకులు లేకుండా, ఆనందంగా, అన్యోన్యంగా సాగుతూ వచ్చింది. వాళ్ళే కనక విడిపోయి ఉంటే తన జీవితం కూడా ఎంతో భిన్నంగా ఉండి ఉండేది.

సోమా పక్కన ఓ మధ్యవయస్సు దంపతులు కూర్చుని ఉన్నారు. ఇద్దరూ ఏదో వినోద యాత్రలకు పోతున్నవాళ్ళలాగా కనబడటంలేదు. ఇద్దరి ముఖాల్లోనూ ఎక్కడలేని ఉత్కంఠ, ప్రయాణం ఎప్పుడు ముగుస్తుందా అన్న ఆత్రత. సోమా చూపులు వాళ్ళ చూపులలో కలిశాయి.

"మిస్ ! మీరు ఇండియా వెళుతున్నారా?" భార్య అడిగింది.

"అవును" అన్నది సోమా.

"మీ పేరు?"

"సోమా ! సోమా హేమర్ షోల్డ్." సోమా చెప్పింది.

"సోమా !" ఆశ్చర్యంగా అన్నది ఆమె, "స్వీడిష్ పేరులాగా లేదు సుమా !"

సోమా నవ్వి ఊరుకున్నది. ఆమెను చూస్తుంటే మమా జ్ఞాపకాని కొస్తున్నది.

"ఇండియాలో ఎక్కడెక్కడి కెళుతున్నారు?" మళ్ళీ ఆమే అడిగింది.

సోమా క్లుప్తంగా తన ప్రోగ్రామ్ చెప్పింది.

"కలకత్తా వెళ్ళటంలేదా?" ఆమె అడిగింది.

"కలకత్తాలో ఏముంది?" సోమా ఆత్రతగా అడిగింది. తన ఇటినరీలో కలకత్తా లేదు.

"మేము అక్కడికి వెళుతున్నాం" అన్నది ఆమె- సోమా ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పకుండానే.

కాబిన్ సర్వీస్ ప్రారంభించారు. సోమా ఆలోచనలు చెదిరిపోయినయ్.


2

ఢిల్లీలో ప్లేన్ దిగాక మౌర్యా షెరటన్ హోటల్లో బస చేసింది సోమా. మర్నాటి ఉదయం 'విజ్ఞాన్‌భవన్'లో కాన్ఫరెన్స్: చాలామంది విదేశీ డెలిగేట్లు ఫైవ్ స్టార్ హోటల్లోనే దిగారు. విశాలమైన, శుభ్రమైన ఢిల్లీ నగరం చూసి చాలా ఇంప్రెస్ అయింది సోమా.

కాన్ఫరెన్స్ రెండు రోజులూ లంచ్, డిన్నర్స్‌తో తెరిపిలేదు. ఢిల్లీ సైట్ సీయింగ్ కాన్ఫరెన్స్ వాళ్ళే ఏర్పాటు చేశారు. ఈ హడావుడిలో అండర్ ప్రివిలేజ్‌డ్ వాళ్ళను గురించి ఎవరూ పట్టించుకోలేదు. ఆ రోజు ఉదయం ఆగ్రా

## వ్యాయామం క్రీడలు

తెలుగువారై ఉండి, ఇతర రాష్ట్రంలో ఆరు అక్టోబరు, 1915 జన్మించి, తెలుగు వారిని మరిచిపోకుండా క్రీడా రంగంలో అంతర్జాతీయ స్థాయిని అందుకున్నారు శ్రీ పరాంకుశం వెంకట రమణమూర్తి. మద్రాసు రాష్ట్రంలోని బెర్హాంపూర్‌లో జన్మించారు. క్రీడా రంగంలో చిన్నప్పుడే ప్రవేశించి భారత స్వాతంత్ర సమరంలో 1930 నుంచి 38 వరకు స్వర్గీయ వి. వి. గిరి, ఉమాచరణ్ పట్నాయక్, బిస్వనాథ్ దాస్ మొదలైన వారితో అనేక బాధలు పడ్డారు. క్రీడా రంగంలో ఫుట్‌బాలు క్రీడతో అడుగు పెట్టి, హాకీ, క్రికెట్ క్రీడల్లో కూడా ప్రావీణ్యం సంపాదించారు. ఆనాటి హాకీ ఒలింపిన్స్ ఏ.జె. అలెన్, తప్సీల్ మొదలైన వారికి ఎదురు నిలబడ్డారు. 1936వ సంవత్సరం గంజాం జిల్లాను ఒరిస్సా రాష్ట్రంలో కలవగానే, వీరు మకాం కటక్‌కు మార్చి అనేక క్రీడల రాష్ట్ర సంఘాల స్థాపనకు కృషి చేశారు. 1949 వరకు ఒరిస్సాలో



రాష్ట్ర హాకీ సంఘం లేనందువల్ల అనేక పెద్ద పెద్ద హాకీ పోటీల్లో 1939 నుంచి 48 వరకు రోవర్స్ క్లబ్‌కు ఆడారు. కటక్‌లో ఆంధ్రా క్రికెట్ క్లబ్‌ను 1951లో స్థాపించి 1980వ సంవత్సరం వరకు క్రికెట్ ఆడారు. 1952 నుంచి అనేక రాష్ట్ర సంఘాలను స్థాపించి కార్యదర్శి, సహాయ కార్యదర్శి పదవులను అలంకరించి సేవ చేశారు. చాలా సంవత్సరాలు స్వర్గీయ విజ్జీ, చిన్నస్వామి, శ్రీరాం వంటి క్రికెట్ మేధావులతో కలిసి క్రికెట్ కంట్రోల్ బోర్డు సభ్యులుగా ఉన్నారు. రాష్ట్ర వాలీబాలు, బాస్కెట్‌బాలు, కబాడీ సంఘాల స్థాపకుల్లో వీరూ ఒకరు. 1961 నుంచి 80 వరకు ఒరిస్సా హాకీ సంఘ కార్యదర్శిగా ఉంటూ, 1976, 80 సంవత్సరాలు జాతీయ పోటీలను నిర్వహించారు. 1975 పశ్చిమ జర్మనీ, స్పెయిన్, ఫ్రాన్స్ దేశాల్లో పర్యటించిన భారత జూనియర్స్ హాకీ జట్టు మేనేజర్. 1978 ప్రపంచ హాకీ కప్ పోటీల పరిశీలకులుగా వ్యవహరించారు. ఒరిస్సాలో ఈనాటికీ రాష్ట్ర కారమ్స్, హాండ్‌బాల్, సైక్లింగ్, టెన్నిస్ సంఘాలను స్థాపించి 70 ఏళ్ళు దాటినా యువకునివలె క్రీడా రంగానికి సేవ చేస్తున్నారు.

ఏకా

వెళుతుంటే ఏ.సీ. బస్‌లో తనతో స్టాక్‌హోం నుంచి వచ్చిన దంపతులు కనిపించారు. ఆగ్రా తరువాత ఖజురాహో, ఆపైన కలకత్తా - అదీ వాళ్ళ ప్రోగ్రాం.

వాళ్ళను మళ్ళీ చూశాక సోమాకూ కలకత్తా వెళ్ళాలనే కోరిక కలిగింది. కలకత్తాలో మదర్ థెరెసా ఉంటుంది, నోబెల్ లారియట్. ఆమెను చూడటానికే వెళుతున్నారు వాళ్ళు. తన ప్రోగ్రాం అంతా ముందుగానే ఏర్పాటయింది. ఖజురాహో తరువాత మళ్ళీ ఢిల్లీ, తరువాత అజంతా - ఎల్లోరా, బొంబాయి నగరం చూడటం. ఓ రోజు గోవా బీచ్‌లో గడపటం. బొంబాయి తిరిగి వచ్చి స్టాక్‌హోం తిరిగి వెళ్ళటం. ఖజురాహో నుంచి తిరిగి వచ్చారు టూరిస్ట్ గ్రూపు.

కలకత్తాను చూడాలని సోమాకు ఎక్కడలేని కోరిక కలుగసాగింది. ఆ కోరికను ఆమె అణుచుకోలేకపోతున్నది. ఎలాగైనా కలకత్తా వెళ్ళాలి: మదర్ థెరెసాను చూడాలి. అండర్ ప్రివిలేజ్‌డ్ వాళ్ళకు అంత చేయూత నిస్తున్న




మదర్ థెరెసాను చూడకుండా ఎలా? ఎక్కడలేని ఉత్కంఠ, ఆవేదన, ఆత్రత. తెగించి కలకత్తాకు ఏర్ టిక్కెట్టు కొనుక్కుంది సోమా.

ఆ స్వీడిష్ దంపతులకు హోటల్ బుకింగ్స్ ఉన్నాయ్. సోమా కూడా అదే హోటల్లో దిగింది. డమ్ డమ్ ఏర్‌పోర్ట్ నుంచి కలకత్తా నగరం వచ్చే తోవలోనే ఎన్నో స్లమ్స్, ఎంతో బీదతనం. ప్రపంచంలోని అండర్ ప్రివిలేజ్‌డ్ పాపులేషన్ అంతా కలకత్తాలోనే ఉన్నట్లనిపించింది సోమాకు. అందుకే కాబోలు 'ప్రాబ్లమ్స్ ఆఫ్ అండర్ ప్రివిలేజ్‌డ్' గురించిన కాన్ఫరెన్స్‌కు వచ్చిన ప్రతినిధుల ఇటనరీలో కలకత్తా పట్నం లేదు. వాట్ ఎ పారడాక్స్ !

ఫుట్‌పాత్ మీద కాపురమున్న కుటుంబాలు. కుక్కపిల్ల సంతానంలా పిల్లలు. ఎటు చూసినా కలుషితమైన వాతావరణం. నరకంలాగా తోచింది సోమాకు కలకత్తా నగరం. ప్రపంచంలో ఎక్కడైనా ఇంత ఘోర దారిద్ర్యం ఉంటుందని అనుకోలేదు సోమా. ఆమె గుండె ద్రవించిపోయింది. అర్ధనగ్నంగా ఉన్న స్త్రీలనూ, దీనమొలతో ఉన్న పిల్లలనూ చూసి ఆమె కళ్ళు మూసుకుంది. ప్రేతాత్మల్లా ఉన్న బక్కచిక్కిన మగవాళ్ళను చూసి, దుర్గంధంలో నిండిన వాతావరణంలో తిరుగుతూ ఆమె వాంతి చేసుకోబోయింది. అయినా ఆమె అక్కడ నుంచి కదలదలుచుకోలేదు. మంత్రముగ్ధలా అలాగే ఉండిపోయింది.

మధ్యాహ్నం మదర్ థెరెసాతో ఇంటర్వ్యూ. ఆ దంపతులతో బాటు తనూ వెళ్ళింది సోమా. 'మానవ సేవే మాధవ సేవ' ఇది హిందువుల నమ్మకం. దాన్ని కార్యరూపంలో చూపించింది ఎన్నో వేల మైళ్ళ దూరంనుంచి వచ్చిన మదర్ థెరెసా. ఆమె కార్యస్థానం మదర్స్ హోం. మదర్ థెరెసాలో మేరీ మాతను చూసింది సోమా. ప్రతి జీవి కనుకొలకుల్లోంచి కన్నీటిబొట్లను తుడవటానికి బద్ధకంకణం కట్టుకున్న థెరెసా ఎదుట నిల్చుంటే ఆమె చూపుల ద్వారా సోమా శరీరంలోకి ఏదో వింత కాంతి ప్రవహించినట్లయింది. ఆశ, ఆసరా రెండు లేని జీవచ్ఛవాల్లో సైతం జీవనేచ్ఛ కలిగించిన కరుణామయి మదర్ థెరెసా. ఆమె చూపులతో చూపులు కలిపినప్పుడు తనని తనే మరిచిపోయి, హిప్నటైజ్ అయిపోయింది సోమా. ఆ థ్రిల్ నుంచి తనని తాను సంబాళించుకునేందుకు ఎంత సమయం పట్టిందో సోమాకు అంచనాయే లేదు. స్పృహ వచ్చాక ఓ దేవత నుంచి వీడ్కోలు పొందినట్లు ఫీలైంది సోమా. అక్కడే ఉండిపోవాలనే ప్రగాఢమైన కోరికను ఎంతో ప్రయత్నంతో నొక్కిపట్టి ఆమె సెలవు తీసుకుంది. తన ప్రయాణపు ఏర్పాట్లలో ఏ విధమైన మార్పూ తీసుకురావటం దాదాపు అసంభవం.

మదర్ థెరెసా మదర్స్ హోం చూసి తిరిగి వస్తుంటే సోమా పర్సు ఎవరో కొట్టేశారు. అందులో ఎంతో డబ్బు లేదు. అయిదు అమెరికన్ డాలర్స్ మాత్రమే. పర్సు పోవటం గుర్తించగానే సోమా జాలిపడింది- ఆ దొంగకు తాను పోగొట్టుకున్న డబ్బు ఏ విధంగానూ ఉపయోగపడదు కదా అని.

సోమా గుండె ద్రవించి పోయింది. తన పర్సు పోయినందు కన్నా ఆ డబ్బు కొట్టేసిన వాడికి ఉపయోగపడక పోవటం ఎంత దురదృష్టకరం!

తిరిగి ఢిల్లీ వచ్చే ప్లైటు ట్రై మయింది. యాంత్రికంగా ఏర్‌పోర్ట్‌కి వచ్చింది గాని సోమా మనసంతా కలకత్తా మురికివాడల్లోనే ఉండిపోయింది. ఆమె చదువూ, సంస్కారం, ఆలోచనలూ ఒక్కసారి కూకటివేళ్ళతో కదిలిపోయినట్లయింది. ఆమె తన అస్తిత్వాన్నే కోల్పోయింది. ఇంత మటుకూ తను జీవించిన జీవితం వ్యర్థమనిపించ సాగింది.

తనతో వచ్చిన. స్వీడిష్ దంపతులు కలకత్తాలోనే ఉండిపోయారు.

గోవా, అజంతా, ఎల్లోరాలు చూశాక సోమా బొంబాయి వచ్చింది. ఆ రోజే తిరుగు ప్రయాణం. ఇండియాలో తను చూసిన దంతా ఒక ఎత్తుగా, కలకత్తాలో తను చూసింది ఒక ఎత్తుగా ఆమె అనుకోసాగింది. ఆమె మనసులో ఏదో భయం రూపం దాల్చసాగింది. ఏదో తెలియని ద్వంద్వ భావం కొట్టు మిట్టాడసాగింది.

సోమాను ప్లేనులో చూసిన స్వీడిష్ దంపతులు ఆమెను చూడగానే గ్రీట్ చేశారు. వాళ్ళ పక్క సీట్లో ఓ మూడేళ్ళ పాప కూర్చుని ఉంది. బెరుకుగా సింహపు ముఖంలోకి పోతున్న లేడి పిల్లలా ఉంది ఆ పిల్ల. కారుతున్న ముక్కు చేత్తో తుడుచుకుంటూ మార్చి మార్చి ఆ దంపతుల వంకా, సోమా వంకా, ప్లేన్ కప్పు వంకా చూస్తూ ఉం దా పిల్ల. కొత్త ఛట్టల్లో చక్కగా దువ్విన జుత్తులో, అందమైన కళ్ళతో ఆ పిల్ల మెరిసిపోతున్నది. ఆ దంపతులు ఆమె వంక కౌతుకంతో ఆశ్చర్యంతో చూస్తూ, సోమా వంక చూసి వింతగా నవ్వారు.

మనసులో ఎన్నో సంశయాలతో, తెగని ప్రశ్నలతో సోమా వచ్చి తన సీట్లో కూర్చున్నది.

విమానం బయలుదేరింది.

ఆ దంపతుల పక్కన కూర్చున్న ఆ పిల్లను ఎక్కడో చూసినట్లు సంశయం కలుగసాగింది సోమా. ఎక్కడ చూసింది... ఢిల్లీలోనా? బొంబాయిలోనా ఎక్కడ? కాదు - ఆః ఆమెకు మెల్లిగా జ్ఞప్తికి రాసాగింది. కలకత్తా మదర్ థెరెసా మదర్స్ హోమ్‌లో చూసింది. అవును మదర్స్ హోంలో చూసింది. ఆమెలో ఎక్కడో ఆవేదన, ఉత్కంఠ. ఒక్క ఉదుటున తన సీట్లోంచి లేచింది సోమా. ఆ దంపతుల దగ్గరికి వెళ్ళింది. ఆ పిల్ల ఇంకా అలాగే బెరుకుగా తప్పి పోయిన పిల్లలా చూడ సాగింది.

"ఈ పిల్ల ... ఈ పిల్ల ...." నసిగింది సోమా.

దంపతులు వెంటనే సమాధానం చెప్పలేదు. ఒకరి ముఖం ఇంకొకరు చూస్తూ ఉండిపోయారు. ఏమి చేయటానికీ తోచక ఆమె తన సీట్లోకి వచ్చి కూర్చుంది.

ఆ పిల్లను దొంగతనంగా గాని తీసుకు పోవటం లేదు కదా ఆ దంపతులు? స్వీడన్‌లో 'లేబర్' దొరకటం కష్టం. బీద పిల్లను ఏదో ప్రలోభం చూపి తమతో స్వీడన్ తీసుకు పోవటం లేదు కదా? అలా కాకపోతే తను అడిగిన ప్రశ్నలకు సమాధానం ఎందుకు చెప్పటం లేదు వాళ్ళు? వాళ్ళ మీద ఎక్కడ లేని జుగుప్సా ఉబికి వచ్చింది సోమా మనసులో. అందుకనే కాబోలు కలకత్తాలో ఇన్ని రోజులు ఉన్నది వాళ్ళు. ఎంత దారుణమైన బానిస వ్యాపారం! 'వరల్డ్ ఆర్గనైజేషన్ ఫర్ ఎమాన్సిపేషన్ ఆఫ్ అండర్ ప్రివిలేజ్‌డ్' ద్వారా ఇలాంటి కుతంత్రాలను అణగదొక్కటానికే నిర్ణయించుకున్నది సోమా. వాళ్ళ విజిటింగ్ కార్డ్ ఉంది. స్టాక్‌హోం వెళ్ళగానే పోలీసులకు రిపోర్ట్ ఇచ్చి వీళ్ళ పని పడుతుంది తను.

ఎంతటి అమానుషమైన చర్య! బీదతనంతో బాధ పడుతున్న ప్రజానీకానికి ఆ అభావాన్ని

ఆధారం చేసుకుని వాళ్ళ కుత్తుకలు నొక్కే నంస్కార విహీనులు స్వీడన్‌లో కూడా ఉన్నారని సోమా అంతవరకూ భావించనే లేదు. ఇలా తన ఎరుకన, తన కళ్ళ ముందు జరగటం ఆమె నహించ లేకపోయింది.

స్టాక్‌హెూం ఏర్‌పోర్టులో ప్లేన్ ఆగగానే దిగిపోయింది సోమా. మూడేళ్ళ ఆ పిల్లను తీసుకుని ఆ దంపతులూ దిగి వచ్చారు. ఏర్‌పోర్ట్ బయటికి వచ్చే దాకా ఆమె ఎదురు చూస్తూనే ఉంది. వాళ్ళ ముఖంలో ఎక్కడా ఏదో తప్పు చేస్తున్నట్లు లేదు.అయితే ఏదో అనందిగ్ధ స్థితిలో ఉన్నవాళ్ళలా ఉన్నారంతే. వాళ్ళిచ్చిన అడ్రస్ కార్డ్ తన దగ్గరున్నది. తను వాళ్ళని వదలదు.

ఏర్‌పోర్ట్ లాంజ్‌లో మమా, పాపా తన కోసం ఎదురు చూస్తున్నారు. వారం రోజులే ఓ యుగంలాగా ఉన్నట్లుంది. వెళ్ళేటప్పుడు వాళ్ళ ముఖాల్లో కనిపించిన విషాదం ం, ఇప్పుడు మటుమాయమైపోయి నట్లయింది. మమా సోమాను కౌగలించుకుంది. పాపా బుగ్గ మీద ముద్దు పెట్టుకున్నాడు. ఓ బంగారు కొండ దొరికి నట్లనిపించింది వాళ్ళకు. ఉల్లానంతో ఉత్సాహంతో ఇంటికి తిరికి వచ్చారు కారులో. కొద్ది రెస్టన్నా తీనుకోకుండా ఇండియాలో తను చూసిన విషయాలు వింతగా చెప్పసాగింది సోమా. అక్కడి ప్రజల దీన పరిస్థితి, కలకత్తా నగరమనే నరకకూపం, అక్కడి ఆశాజ్యోతి 'మదర్ థెరెసా'. అక్కడి నుండి స్వీడిష్ దంపతులు ఎలా ఓ పసికందును బానిసగా తీసుకు వచ్చిందీ - వాళ్ళ మీద తను తీసుకుకోబోతున్న చర్యా.

హఠాత్తుగా మమా, పాపాల ముఖాలు వెలవెలాపోయినయ్. నిర్జీవమైన ప్రతిమల్లా ఆమె వంక చూస్తూ ఉండిపోయారు కొద్ది నిముషాల తరువాత పాపా తేరుకుని అన్నారు.

"బానినగా తీసుకొచ్చారని ఎందుకను కోవాలి? పిల్లలు లేక పెంచుకోటానికి తీసుకొచ్చుకున్నారేమో? లీగల్ ఫార్మాలిటీజ్ పూర్తి చేయకుండా ఎలా తీసుకు రాగలరు సోమా?"

ఆలోచించగా పాపా చెప్పింది నబబే ననిపించింది సోమాకు. అనవసరంగా వాళ్ళని అనుమానించింది తను.

పాపా ఇంకా ఏదో చెప్పబోతూంటే కనుచూపులతో వారించింది మమ్మీ.

"అందరూ నా పేరు చూసి ఆశ్చర్యపడటమే మమ్మీ, సోమా అన్న పేరు స్వీడిష్ యువతి కుండటం." సోమా బిగ్గరగా నవ్వుతూ అన్నది.

మమ్మీ ఏమీ నమాధానం చెప్పలేదు. మళ్ళీ పాపానే అన్నారుజ

"అది సాన్‌స్క్రిట్ నేమ్ సోమా. నువు ఈ ఇంట్లోకి రాకముసుపు మేమూ ఇండియా వెళ్ళి వచ్చామని చెప్పాను కదా! సోమా అంటే నెక్టార్. మా జీవితాల్లో నెక్టార్‌లాగా వచ్చావు నువ్వు. అందుకనే ఆ పేరు పెట్టాం నీకు. అవును. అది స్వీడిష్ పేరు కాదు."

నంభాషణను తుంచుతూ మమా లేచి నిల్చున్నది. ఆమె ముఖంలో ఏదో అందోళన కొట్ట వచ్చినట్లు కనిపిస్తూనే ఉంది. పాపా సోమా ముఖం వంక చూస్తూ అలాగే ఉండిపోయారు.

"సో అయ్ హావ్ యాన్ ఇండియన్ నేమ్. ఐ హావ్ నంథింగ్ ఇండియన్ ఇన్ మి." లేచి డాన్సు చేసినంత పని చేసింది సోమా.

మమా, పాపా దిగ్భ్రాంతిలో చూడసాగారు.

"సోమా ప్రయాణంలో అలిసిపోయి ఉంటావు, పోయి రెస్ట్ తీసుకో' అంటూ పాపా తన రూంలోకి వెళ్ళిపోయారు.

ఓ వారం రోజులు మామూలుగానే గడిచిపోయినయ్.

"నేను ఇండియా వెళ్ళి అక్క సెటిల్ అవుదా మనుకుంటున్నాను." ఒక రోజు రాత్రి డిన్నరు దగ్గర హఠాత్తుగా ప్రకటించింది సోమా.

వాళ్ళ మధ్య హఠాత్తుగా బాంబు పడ్డట్టు ఉండి పోయారు మమా, పాపా. తనని వాళ్ళెన్నో ప్రశ్నలు వేస్తారనీ, వాటికి నమాధానం ఏం చెప్పాలో అనీ, తడబడ పడింది సోమా. వాళ్ళ మౌనం భరించ లేనిదయ్యింది. ఆ మౌనమే ఎన్నో ప్రశ్నలు వేస్తున్నట్లు ఫీలైంది ఆమె.

"ఇండియా నీడ్స్ మి మమా! అక్కడి అండర్ ప్రివిలేజ్‌డ్ పీపుల్‌కి నా అవసరం ఎంతో ఉంది. వాళ్ళను చూస్తే వాళ్ళకీ, నాకూ ఏదో అనుబంధం ఉన్నట్ల నిపించింది. ఎందుకనో నా మనను ఇండియా వెళ్ళమని పదే పదే చెబుతున్నది. ఎంత అణుచుకున్న కట్టలు తెంచుకుని ప్రవహించే ప్రవాహంలా నా ఆలోచనలు నా మనశ్శాంతిని హరించినయ్. అవి నా అధీనంలో లేవు."

తన మనసులో ఉన్నది విడమరిచి చెప్పా ననుకున్నది సోమా, అయినా మమా, పాపా తమ ఇష్టానిష్టాలు ప్రకటించ లేదు. కంట్లో ఏదో



నలకవడట్టు కళ్ళు ఒత్తుకున్నది మమా.

అలా నిశబ్దం రాజ్యం చేశాక ముగ్గురూ డైనింగ్ టేబులు దగ్గర నుంచి లేచారు.

వాళ్ళు కాదంటే తయారు చేసి ఉంచుకున్న ఆర్గ్యుమెంట్లు సోమా వాడవలసిన అవసరం లేదు. వాళ్ళే మన్నా తన నిర్ణయం మారేదే లేదు.

అన్ని ఫార్మాలిటీస్ పూర్తి చేసుకుంది సోమా. ఆ రోజే ఇండియా ప్రయాణం. టెంపరరీ వీసాతో వెళుతున్నది మదర్స్ హెూంలో పనిచేయటానికి. బ్రహ్మ ప్రయత్నం చేయవలసి వచ్చింది దాని కోసం. స్నేహితులు, బంధువులు ఎందరో ఇండియాలో స్థిర పడటం మంచిది కాదని నమ్మించటానికి ప్రయత్నించారు. ఇక్కడున్న సుఖ శాంతులను, ఆర్థిక స్థిరత్వాన్ని అన్నిటినీ వదులుకొని బీద దేశం ఇండియా వెళ్ళటం మూఢత్వం అన్నారు.

అందరికీ సోమా ఇచ్చిన సమాధాన మొక్కటే. "స్వీడన్ కన్నా ఇండియాకు నా అవసరం ఎంతో ఉంది. నన్ను పోనియ్యండి."

ఆఖరికి ప్రయాణమై వెళ్ళే రోజు వచ్చింది. ఇల్లాంతా నిశబ్దం తాండవ మాడుతున్నది. తన సామానంతా సర్దుకుంది సోమా. ఆమెలో మటుకు ఎక్కడ లేని ఉత్సాహం. ఎక్కువ కాలం పాపా, మమాలతోటే గడిపింది సోమా.

ఫ్లైట్ టైమౌతున్నది. మమా ఓ చిన్న పాకెట్ తెచ్చి ఇచ్చింది సోమాకు.

"ఇదేమిటి మమా?" సోమా కుతూహలంతో అడిగింది.

"ఈ పాకెట్ సూట్‌కేస్‌లో పెట్టుకో!" పాపా అన్నారు.

విప్పి చూడబోయింది సోమా.

"ఇప్పుడు కాదు. ఇండియా వెళ్ళాక విప్పిచూడు" అన్నారు పాపా.

అందులో ఏముందో చూడాలని కుతూహలంగా ఉంది సోమాకు. అయినా పాపా మాట కాదనలేక పోయింది. లాక్ చేసిన సూట్‌కేస్ తీసి పెట్టుకుంది.

ఏర్‌పోర్టులో వీడ్కోలు సమయంలో మమా నోట మాట రాలేదు. పాపా ఆమెను ఓదారుస్తూనే ఉన్నారు. వాళ్ళిద్దరి స్థితీ చూస్తూ సోమా ఉత్సాహం కొంత అణగారి పోయింది. ఆఖరికి సోమా విమానం స్టాక్‌హెూం ఆకాశంలో నక్షత్రమై పోయింది. భవిష్యత్తు మీద ఆశతో, తన ఆశయాన్ని సాధించబోతున్నా నన్న తృప్తితో సోమా తన సీట్లో కూర్చుంది. ఆమె కళ్ళ ముందు అనాథులైన లక్షలాది పిల్లల రూపాలు తాండవ మాడసాగినయ్. ఎప్పుడు ఢిల్లీ వచ్చిందో, ఎప్పుడు 'ఎన్నేన్లో' అయిందో ఆమెకు గుర్తు లేదు. మమా ఇచ్చిన పాకెట్‌లో ఏముందో చూడాలని ఆమెకు ఉత్సాహంగా ఉంది. ఏమి ఇచ్చి ఉంటుంది మమా? అపారమైన మమా ప్రేమ, పాపా వాత్సల్యం ఒక్కసారి గుర్తుకు వచ్చినయ్ సోమాకు.

హెూటల్‌లో చెక్ ఇన్ చేసి తన గదిలోకి వచ్చి కూర్చుంది, ఆత్రతతో, ఉత్కంఠతో సూట్‌కేస్ తెరిచి పాకెట్ బయటకు లాగింది సోమా. ఎందుకనో హఠాత్తుగా ఆమె చేతులు వణకసాగినయ్. ఆ వణుకుతున్న చేతులతోనే పేకెట్ విప్పింది సోమా. విప్పిన పాకెట్‌లో ఓ చిన్న ఫ్రాక్, చిన్న పిల్లలు తలలో పెట్టుకునే రిబ్బను ఉన్నాయ్. ఫ్రాక్ చిరిగిపోయి మాసిపోయి ఉంది. రిబ్బను అతి చౌకబారు రకంగా ఉంది. ఆశ్చర్యంగా వాటి వంక చూడసాగింది సోమా. రెండు మూడేళ్ళ పాప ఫోటో, బ్లాక్ అండ్ వైట్ ఆ ముఖం ఎక్కడో చూసినట్లుంది. ఓ చిన్న జాబు కూడా ఉంది.

"డియర్ సోమా!

పదిహేడేళ్ళ క్రితం నువ్వు ఇండియా నుంచి స్వీడన్ వచ్చినప్పుడు నీతో వచ్చిన వస్తువు లివి. నువ్వే మాకు కానప్పుడు ఈ వస్తువు లెందుకు? అందుకనే .....

మమా-"

సోమా సోఫాలో కూలబడి పోయింది. ఆమె చేతిలో ఆ ఫోటో అలాగే ఉంది.

"మీ పేరు ఇండియన్ పేరులా ఉంది కదూ?" ఎవరో చెవుల్లో అరిచినట్లయింది.

ఒక్క క్షణం, అంతే! సోమా ముఖంలో ఏదో అనిర్వచనీయమైన కాంతి కనుపించింది. ఆమె పెదవుల మీద చిరునవ్వు చిందులు వేసింది. ఆ పాకెట్ కట్టి మళ్ళీ భద్రంగా సూట్‌కేస్‌లో పెట్టుకుంది.

చకచకా పనులన్నీ చేసుకుంది. ఈవినింగ్ ఫ్లై ట్‌లో కలకత్తా వెళుతుంది తను. ఏ భూమి నుంచైతే వచ్చిందో అక్కడికే మళ్ళీ వెళుతోంది.



SKF – ఎస్‌కేఎఫ్ ఉత్పాదన.
HTA-1897